


# యమదూత

**మనకి కిరాయి** హంతకులు పెద్దగా ఉండరు. కానీ అమెరికన్ క్రైమ్ సాహిత్యంలో కిరాయి హంతకులు విరివిగా ఉంటారు. అలాంటి కొన్ని కథలు చదివాక అల్లుకున్న కథ 'యమదూత'

నేను ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక 2000వ సంవత్సరంలో రాసిన క్రైమ్ నవల 'ముంగిట మృత్యువు'. తర్వాత రాసిన క్రైమ్ నవల 'యమదూత'. ఈ నవల్లోని ప్రధాన పాత్రకి విచిత్రమైన పేరు పెట్టాలని మొదటే అనుకున్నాను. ముందుగా అనుకున్న పేరు ప్రాణేష్ కానీ నా చివరికోరిక పుస్తకాన్ని ప్రచురించిన ప్రిజమ్ బుక్స్ మేనేజింగ్ డైరెక్టర్ పేరు కూడా అదే అవడంతో ఆ పేరు పెట్టడం బావుండదని పెట్టలేదు. తర్వాత ఈ నవలకి, ఇందులోని కిరాయి హంతకుడికి పెట్టిన పేరు సమవర్తి. కానీ ఇది రాసే సమయంలో కనకమేడల రాసిన 'మహామాయ'లోని కొన్ని భాగాలు దొరికాయి. వాటిని చదివాక అందులోని ఓ ప్రముఖ పాత్ర పేరైన యమదూత పేరు నచ్చి ఆ పేరే ఈ నవలకి పెట్టాను. సమవర్తి అతను పెట్టుకున్న మారుపేరు. సమవర్తి అంటే కూడా యముడనే అర్థం. ఆ కిరాయి హంతకుడి అసలు పేరు దివ్యకాంత్.




1.0.6 క్లబ్ అనే పేరుతో నడిచే సంస్థ కిరాయి హంతకులని నియమించి చంపుతుంటుంది. యమదూత దానికోసం పనిచేసే హంతకుల్లో ఒకడు. 1.0.6 అంటే, 1. ఒకే ఆయుధం. 0. జీరో సాక్షులు. 6. ఆరడుగుల గొయ్యి. ఈ ఆదర్శంతో 1.0.6 క్లబ్ పని చేస్తుంది. ఈ నవలకి 1.0.6 అనే పేరు పెట్టాలని కూడా ఓ సమయంలో అనుకున్నాను. బహుశ యమదూత దొరక్కపోతే ఆ పేరే పెట్టి ఉండేవాడిని. మహామాయలోని నా అభిమాన పాత్ర యమదూత పేరుని పెట్టకుండా ఉండలేకపోయాను.

సమవర్తి ఓ కిరాయి హత్య చేయడంతో ఈ నవల మొదలవుతుంది. అతను అందర్నీ ఒకే పద్ధతిలో చంపుతాడు. మెడ విరిచి. చాలా సంవత్సరాలుగా హత్యలు చేస్తున్నా పట్టుబడక పోవడానికి అతను తీసుకునే జాగ్రత్తలు. వాటిలో ఒకటి అనామకులైన ఇతరులకి చెందిన ఆధారాలని వదిలి వెళ్ళడం, మారువేషాలు వేసుకోవడం, పోలీస్ ప్రొసీజర్ గురించి క్షుణ్ణంగా తెలుసు కాబట్టి వాళ్ళకి దొరికిపోయే పొరబాట్లు చేయకపోవడం.

అతని కూతురు నీతిక. తల్లి లేదు. తండ్రి కిరాయి హంతకుడని తెలీదు. కానీ ఓ రోజు నీతికకి తండ్రి వృత్తి గురించి తెలుస్తుంది. పోలీసులకి చెప్పాలా వద్దా అని ఆమె చాలా మధనపడుతుంది. ఓ పక్కన తండ్రి మీద ప్రేమ. మరో పక్క ప్రజల ప్రాణాలు. చివరకి ఇంద్రజిత్ అనే ఏసిపిని కలిసి తన తండ్రి కిరాయి హంతకుడని చెప్తుంది. అక్కడ పనిచేసే పోలీస్ ఆఫీసర్ కుందన్‌తో పరిచయం ఏర్పడి అది ప్రణయంలోకి దారి తీస్తుంది.

ఆమె ఓ పోలీస్ ఆఫీసర్‌తో ప్రేమలో పడిందని తెలిసినా, కూతురంటే చాలా ప్రేమ కాబట్టి సమవర్తి వద్దనడు. హత్యల్లో కూడా యమదూత ఓ ఆదర్శాన్ని పాటిస్తాడు. దోషులని తప్ప అమాయకులని చంపడు. చంపాల్సినంత అన్యాయం కాని, నేరం కాని చేసిన వాళ్ళనే చంపుతాడు. అంటే ఆస్థికోసం అమాయక తండ్రిని చంపమని కొడుకు కోరినా చంపడు. అదే తన భార్యని రేప్ చేసి చట్టం నించి తప్పించుకున్న రేపిస్ట్‌ని చంపమని కోరితే చంపుతాడు. చెడులో మంచన్నమాట. అతనిలోని మరో కోణం దాతృత్వం. తను సంపాదించిన దాంట్లో కొంత బీదలకి దానం చేస్తూంటాడు. చదరంగం ఆట నేర్పుతూ ఆ ఆదాయంతో జీవిస్తున్నాడని చుట్టుపక్కల వారికి తెలుసు తప్ప అతని అసలు వృత్తి ఎవరికీ తెలీదు. ఈ నవల్లో చదరంగానికి చెందిన చాలా సమాచారం రాసాను.

ఇందులో మొబైల్స్, సి.సి కెమేరాలవల్ల నేరస్థులని తేలిగ్గా ఎలా పోలీసులు పట్టుకోగలుగుతున్నారో కూడా వివరంగా రాసాను. వాటి బారిన పడకుండా ఉండటానికి తెలివైన నేరస్థుడు యమదూత ఏం ట్రిక్స్ వాడతాడో రాసాను. రాసేప్పుడు నేను ఎక్కువ దృష్టిపెట్టి యమదూత కేరక్టరైజేషన్‌కి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాను. ఓ క్రైం నవలకి ఎలాంటి ఎత్తుగడ, నడక, ముగింపు, సస్పెన్స్‌లు ఎలా ఉండాలో ఆ గ్రామర్‌ని అనుసరించి దీన్ని రాసాను.

పోలీసులు యమదూత నేరాల ఋజువు కోసం నీతిక సాయం అడుగుతారు. అతను చాలా జాగ్రత్త మనిషి కాబట్టి అది ఓ పట్టాన దొరకదు. చివరికి దొరికాక పోలీసులు అతని ఇంటిని చుట్టుముడతారు. ఆ తర్వాత ఏం జరిగింది అనేది ఓ ట్విస్ట్‌తో ముగుస్తుంది. ఈ ముగింపు ఓ చిన్న ఇంగ్లీష్ కథలోంచి తీసుకున్నాను.

తన జీన్స్‌లో అంత క్రూరత్వం ఉందని భయపడిన నీతిక పెళ్ళయ్యాక తనకి పిల్లలు వద్దనే షరతుని విధిస్తుంది. కానీ దీనికి ఓ సెంటిమెంటల్ ట్విస్ట్‌తో పరిష్కారం లభిస్తుంది. గ్రీన్ టీ తాగితే కేన్సర్ రాదని, ఏంటీఆక్సిడెంట్స్ లభిస్తాయని ఈ నవల రాసేప్పుడు బాగా ప్రచారం జరిగింది. అందుకని ఈ నవల్లో టీ గురించిన కొంత సమాచారాన్ని, బాంబేలో బస్ కండక్టర్‌గా పనిచేసి, తర్వాత హిందీ పాటలు రాసే హస్రత్ జైపురి, వాటిని పాడిన ముఖేష్‌ల గురించి కూడా రాసాను.

2012 నించి నేను టోరీ రేడియోకి ఆర్జేగా పనిచేస్తున్నాను. ఇది రాసే సమయంలో ఓ శుక్రవారం రాత్రి మల్లాది ముచ్చట్లులో హిందీ పాటలమీద కార్యక్రమం చేసాను. ఆ ఫోన్ ఇన్ కార్యక్రమంలో చాలామంది శ్రోతలు స్పందించి మాట్లాడారు. తెలుగు వాళ్ళల్లో హిందీ పాటలని అభిమానించే వారు చాలామంది ఉన్నారని తెలిసి ఈ నవల్లో ఆ సమాచారం రాసాను. తర్వాత యమదూత చదివిన కొందరు పాఠకులు పాత రోజులు గుర్తుకు వచ్చాయని నాకు చెప్పారు.

ఆ నాటి ఆంధ్రభూమి డైలీ ఎడిటర్ శ్రీ ఎం.వి.ఆర్. శాస్త్రి ఓ సీరియల్ అడిగారు.ఈ థీమ్‌నే ఈ మెయిల్ చేసాను. ఐతే నేను అడిగిన పారితోషికంలో ఆరోవంతు మాత్రమే ఇవ్వగలని చెప్పారు. సీరియల్స్‌కి కాలం చెల్లిందని అప్పటికే గ్రహించాను. పత్రికల వాళ్ళు ఇచ్చే పారితోషికం అతి తక్కువ. నేను అందుకు నిరాకరించాను.

కొద్ది కాలం తర్వాత ఆయన ఫోన్ చేసి యమదూత నవల ఇంకెక్కడైనా రాసానా అని అడిగారు. లేదంటే, కొత్తగా నవలల పోటీని ప్రకటించామని, దానికి పంపమని మొదటి బహుమతి వస్తే నేను కోరిన పారితోషికం రావచ్చని సూచించారు. ఎడిటర్ తలచుకుంటే అది సాధ్యమే అన్నట్లు ఆయన చెప్పారు. కానీ ఆ ఏర్పాటు నాకు రుచించలేదు. దాన్ని డైరెక్ట్ నవలగా ప్రిజమ్ బుక్స్ వారికి ఇచ్చాను. చివరికోరిక

తర్వాత ప్రిజమ్ బుక్స్ ప్రచురించిన రెండో నవల 'యమదూత' డిసెంబర్ 2014లో విడుదలైంది. వెల రూ.185. పేజీలు 240. సంవత్సరంలోగా అన్ని కాపీలు అమ్ముడయ్యాయి. మలి ముద్రణ వెలువడలేదు. ప్రస్తుతం ఈ నవల మార్కెట్లో లేదు.

ఐతే నేటికీ 'శనివారం నవలుందా? మిస్టర్ వి కాపీ ఒక్కటైనా ఉంటే ఇవ్వగలరా?' అని ఫోన్ చేసే పాఠకులని యమదూత చదివారా? అని అడుగుతూంటాను. చదవలేదనే జవాబు వస్తుంది. నిజానికి ఆ పాత నవల స్థాయికన్నా నా ఉద్దేశంలో యమదూత ఉత్తమ స్థాయి నవల. రచయితగా నాకు పూర్తి సంతృప్తిని ఇచ్చిన నవల కూడా.

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***

Post your comments